సాక్షి
మహబూబాబాద్
శనివారం । 4 । మార్చి । 2023



దోషులను కఠినంగా శిక్షించాలి

ధరావత్ ప్రీతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌నాయక్ కోరారు. - 8లో▸



యోగాతో మానసికోల్లాసం

ప్రజలు యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.9^0 / 16.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చలి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే దంపతులు

మహబూబాబాద్: హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మానుకోట ఎమ్మెల్యే దంపతులు శంకర్‌నాయక్‌–సీతామహాలక్ష్మి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేసముద్రంలో ఫైర్‌స్టేషన్, మానుకోట మండలంలోని మల్యాలలో హార్టికల్చర్ యూనివర్సిటీ మంజూరు చేయాలని, నామినేటెడ్ పోస్టుల్లో నియోజకవర్గ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మంత్రికి వినతి

హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కలిశారు. మానుకోట నియోజకవర్గంలో రోడ్లు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంట మార్నేని వెంకన్న, ఖాసీం, రంజిత్, మురళీ, తేళ్ల శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

మహబూబాబాద్ రూరల్: మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు ప్రకటించామని ఏఎంసీ సెక్రటరీ రాజేందర్ శుక్రవారం తెలిపారు. శని, ఆదివారం (నేడు, రేపు) వారాంతపు సెలవులు, 6వ తేదీన వ్యాపారస్తుల కోరిక మేరకు పత్తి, మిర్చి మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. 7న హోలీ పండుగ, 8న వ్యాపారస్తుల కోరిక మేరకు మార్కెట్ బంద్ ఉంటుందని తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డులో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

కేసముద్రం మార్కెట్‌కు..

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు సెలవులను ప్రకటించినట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4,5వ తేదీల్లో వారాంతపు సెలవులు ఉండగా, 6న హమాలీ కార్మికుల కోరిక మేరకు, 7న హోలీ పండుగ సందర్భంగా, 8న చాంబర్ ఆఫ్ కామర్స్ కోరిక మేరకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు.

నిట్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ

- డైరెక్టర్ ఎన్వీ.రమణారావు



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో త్రీడీ ప్రింటింగ్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలో గల ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ ల్యాబ్‌లో రూ.65లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన త్రీడీ ప్రింటింగ్ మిషన్‌ను నిట్ డైరెక్టర్ శుక్రవారం ప్రారంభించి.. మాట్లాడారు. త్రీడీ స్ప్రింట్ సాఫ్ట్‌వేర్‌తో ప్రొటోటైప్ ప్రొడక్ట్స్ ప్రింటింగ్‌కు, రీసెర్చ్ స్కాలర్స్, పారిశ్రామిక వేత్తలకు అనుగుణంగా, ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే సీమెన్స్‌లో 13 ల్యాబ్స్ ఉండగా.. త్వరలో 18 ల్యాబ్స్‌ను ఏర్పాటు చేసి మూడేళ్లలో 30వేల మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీమెన్స్ సీఈఓ, ప్రొఫెసర్ ఎల్.కృష్ణానంద్, సీమెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

6న స్ప్రింగ్ స్ప్రీ–23 థీం ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న కల్చరల్ ఫెస్ట్ స్ప్రింగ్ స్ప్రీ–23 థీంను ఈనెల 6న ఆవిష్కరించనున్నట్లు డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిట్ టైమ్ స్క్వేర్ ప్లాజా ఆవరణలో అట్టహాసంగా స్ప్రింగ్ స్ప్రీ–23 థీంను ఆవిష్కరించనున్నామని, ముఖ్యఅతిథిగా నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

నలుగురు డైరెక్టర్ల ఎన్నిక

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా న్యాయవాదుల పరస్పర సహాయ సహకార సంఘం డైరెక్టర్లుగా ఎస్.విద్యాసాగర్, గంధం సురేశ్, ఎస్.చంద్రశేఖర్, పీసరి రాము ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు డి.ప్రేమ్‌సాగర్, పి.శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్.భాగమ్మ, సీహెచ్.చిదంబర్‌నాథ్ తెలిపారు. కోర్టులోని పాత బార్ అసోసియేషన్(మహాత్మా గాంధీ హాల్)లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొత్తం 1,234 ఓట్లకుగాను.. 680 ఓట్లు పోలైనట్లు తెలిపారు. అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో ఎస్.విద్యాసాగర్(381), గంధం సురేశ్(343), ఎస్.చంద్రశేఖర్(326), పీసరి రాము(303) సాధించి విజేతలుగా నిలిచినట్లు వారు తెలిపారు. కాగా.. డైరెక్టర్లుగా ఎన్నికైన వారికి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

జమాండ్లపల్లిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్



బయ్యారంలోని యోగా కేంద్రం



పల్లెల్లో యోగాసనాలు!

- జిల్లాకు 10 కేంద్రాలు మంజూరు
- రూ.60 లక్షలతో సెంటర్ల నిర్మాణం
- ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు

తొర్రూరు: ప్రస్తుత జీవన విధానంలో చాలా మంది ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. శారీరక శ్రమకు దూరమవుతున్నారు. దీంతో రక్తపోటు, మధుమేహం వ్యాధులు ఉన్నవారు ఒత్తిడికి లోనవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా జిల్లాకు తొలి విడతలో 10యోగా కేంద్రాలు (ఆరోగ్య స్వస్థత కేంద్రాలు) మంజూరు చేసింది. విడతల వారీగా మిగతా గ్రామాల్లో ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాలకు అనుబంధంగా వీటిని నిర్మించారు. ఇక్కడ యోగాసనాలతో పాటు ఆరోగ్య సూత్రాలను వివరించనున్నారు. సాధారణ వ్యక్తులతో పాటు గర్భిణులకు అవసరమైన ఆసనాలు నేర్పిస్తారు. శారీరక నొప్పులు, మానసిక ఒత్తిడి, ఇతర అనేక సమస్యలకు ఔషధాలను వినియోగించకుండా యోగా ద్వారా నివారించేందుకు ప్రభుత్వం కేంద్రాల ఏర్పాటుకు పూనుకుంది.

ఒక్కోదానికి రూ.6లక్షల వరకు..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో 10యోగా కేంద్రాలు మంజూరయ్యాయి. తొర్రూరు, వడ్డెకొత్తపల్లి, చిన్నముప్పారం, పెద్దముప్పారం, మన్నెగూడెం, కురవి, ముల్కనూరు, బయ్యారం, జమాండ్లపల్లి, గూడూరు ప్రాంతాల్లో యోగా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున 10 కేంద్రాలకు రూ.60 లక్షలు వెచ్చించారు. జిల్లాలో 9కేంద్రాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. పెద్ద ముప్పారంలో పలు కారణాల రీత్యా పనులు అసంపూర్తిగా మిగిలాయి. కాగా త్వరితగతిన కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసిన జిల్లాల్లో మహబూబాబాద్ రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ఆయుర్వేద ఆస్పత్రులు ఉన్న చోటే యోగా కేంద్రాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎనిమిది అడుగుల వెడల్పు, 21అడుగుల పొడవుతో వెలుతురు, గాలి వచ్చే విధంగా షెడ్లు నిర్మిస్తున్నారు. ఆవరణలో ఔషధ మొక్కలు పెంచుతున్నారు.



తొర్రూరులోని యోగా కేంద్రం

శిక్షకులకు నియామకం ఎప్పుడో..?

ఈ కేంద్రాలకు ప్రభుత్వం ఇద్దరు శిక్షకులను నియమించనుంది. యోగా కోర్సుల్లో ధ్రువపత్రాలు కలిగిన మహిళ, పురుషులను ఎంపిక చేయనున్నారు. వీరికి నెలకు రూ.6వేల వరకు వేతనం చెల్లించనున్నారు. ఆరోగ్య భారత్‌లో భాగంగా ప్రతి పౌరుడు యోగాసనాలు నేర్చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవానికి ఏడాది కిందటే ఇవి మంజూరయ్యాయి. ఈ ఏడాది జనవరిలోనే ప్రారంభించాలని కేంద్రం సూచించింది.

అందుబాటులోకి తెస్తాం



జిల్లాలో 10 యోగా కేంద్రాలు మంజూరు కాగా 9 కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయి. పెద్దముప్పారంలో నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. యోగా కేంద్రాల్లో శిక్షకుల నియామకం చేపట్టడం మా పరిధిలో లేదు. ప్రభుత్వమే నియమించాల్సి ఉంటుంది. సిబ్బందిని నియమిస్తే యోగా సేవలు ప్రారంభిస్తాం. జిల్లాలో పరిస్థితిపై ఉన్నతాధికారులకు సూచించాం.

–డాక్టర్ నిరంజని జకోటియా,
ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల జిల్లా ఇన్‌చార్జ్

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. మానుకోట పట్టణంలోని సిగ్నల్ కాలనీలో చేపడుతున్న బస్తీ దవాఖాన పనులు, డంపింగ్ యార్డు, వెజ్ అండ్ నాన్‌వెజ్ మోడల్ మార్కెట్ పనులను మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గాంధీపురంలో మరో డంపింగ్ యార్డు ఉందని, నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, డీఈ ఉపేందర్, కౌన్సిలర్ డౌలాగర్ స్వాతిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి..

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 4,250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమీక్షలో డీఏఓ ఛత్రునాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

విస్తరించాలి..

గ్రంథాలయ కార్యకలాపాలను విస్తరింపజేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గ్రంథాలయ కార్యకలాపాలపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావుతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రంథాలయాల అన్ని కార్యక్రమాలను విస్తరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, శిక్షణ కలెక్టర్ పింకేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, డీపీఓ ధన్‌సింగ్ ఉన్నారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివాలయంలో పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శివాలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించిన అనంతరం పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి కల్యాణం తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, వేద పండితులు శ్రీకర్, పుణ్యమూర్తి, బాలకృష్ణ, షణ్ముకశర్మ, శ్రీకాంత్, ఆలయ సిబ్బంది బాదె వెంకన్న, రవి, సమ్మయ్య, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

సామాన్యుడి నడ్డి విరుస్తున్న కేంద్రం

- ఎంపీ మాలోత్ కవిత

మరిపెడ: కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోందని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం వంటావార్పు చేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా గ్యాస్ ధరలు పెంచుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలపై భారం మోపుతుందన్నారు. గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు డీఎస్ రవిచంద్ర, మున్సిపల్ చైర్మన్ గుగులోత్ సింధూరరవికుమార్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్, మాజీ ఎంపీపీ వెంకన్న, కౌన్సిలర్లు సుజాతవెంకన్న, ప్రగతిశ్రీపాల్‌రెడ్డి, బయ్యా బిక్షం, ఎడెల్లి పరశురాములు, ఉప్పల నాగేశ్వరరావు, హతీరాం, లలిత వెంకటేశ్వర్లు, భద్రయ్య నాయకులు లతీఫ్, గోల్కొండ వెంకన్న, సర్పంచ్‌లు ఫోరం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్, రఘు తదితరులు పాల్గొన్నారు.



వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న కవిత

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

- ముల్కనూరులో ఏఐఎస్‌ఎఫ్ నాయకుల రాస్తారోకో
- ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డగింత

గార్ల: మండలంలోని హైస్కూళ్లలో సబ్జెక్ట్ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ముల్కనూరు హైస్కూల్ ఎదుట రహదారిపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. బయ్యారం నుంచి గార్లకు వస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కాన్వాయ్‌ని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అడ్డుకున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, పలు హైస్కూళ్లలో నేటికీ సబ్జెక్ట్ ఉపాధ్యాయులను నియమించలేదని, విద్యార్థులు ఎలా పాస్ అవుతారని ఎమ్మెల్యేను అడిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డీఈఓతో మాట్లాడి 10రోజుల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్, మండల అధ్యక్షులు తోకల ఉదయ్, రాంబాబు, కిరణ్, శివ, విద్యార్థులు లక్ష్మి, ఉదయశ్రీ, ఉమ, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

దళితుల జీవితాల్లో వెలుగులు

- దళితబంధుతో ఆర్థికంగా బలపడుతున్న కుటుంబాలు
- జిల్లాలో మొదటి విడతలో 305మందికి లబ్ధి
- స్వయం ఉపాధితో ముందుకు..

మహబూబాబాద్ అర్బన్: దళితుల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకం ప్రవేశపెట్టింది. అర్హత కలిగిన ప్రతి దళిత కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది. పరిశ్రమలు, ఉపాధి, వ్యాపారాలను ఎంచుకుని దళిత సమాజం ఎంతగానో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కాగా మొదటి విడతగా జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరులో 20, పెద్దవంగరలో 10, డోర్నకల్ నియోజకవర్గంలోని చిన్నగూడూరు 80, మరిపెడ 20, ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం మండలంలో 56 మంది, ములుగు నియోజకవర్గం కొత్తగూడలో 12, గంగారం 7, మానుకోట నియోజకవర్గంలో మహబూబాబాద్ రూరల్ 20, మున్సిపాలిటీ పరిధిలో 20, గూడూరు 20, నెల్లికుదురు 20, కేసముద్రం మండలంలో 20మందికి యూనిట్లు అందజేశారు.

ట్రాన్స్‌పోర్ట్, నాన్‌ట్రాన్స్‌పోర్ట్ పథకాలు

జిల్లాలో దళితబంధు పథకం కింద 230ట్రాన్స్‌పోర్టు వాహనాల యూనిట్లను అధికారులు మంజూరు చేశారు. నాన్‌ట్రాన్స్‌పోర్ట్ కింద 75యూనిట్లను మంజూరు చేశారు. కాగా పథకంతో లబ్ధిపొందిన వారు ఇప్పటి వరకు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

దళితబంధు రక్షానిధి..

దళితబంధు లబ్ధిదారులు రూ.10 వేల దళితబంధు రక్షానిధి చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వం మరో రూ.10వేలు ఒక్కో లబ్ధిదారుడి పేరును చెల్లించనుంది. ఆ డబ్బును నిధిలో జమ చేయనున్నారు. లబ్ధిదారుడికి ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి ఈ రక్షా నిధి నుంచి ఆర్థికసాయం అందిస్తారు.

యాక్టింగ్ డ్రైవింగ్‌కు వెళ్లేవాడిని..



గతంలో నేను కారు యాక్టింగ్ డ్రైవింగ్‌కు వెళ్లేవాడిని. రోజుకు రూ. 500వచ్చేవి. దీంతో కుటుంబాన్ని పోషించుకునేవాడిని. అయితే నాకు దళిత బంధు పథకం కింద కారు ఇప్పించారు. ఇప్పుడు నేను నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నాను.

–బందెల మహేష్, మాల్యాల గ్రామం

రోజుకు రూ.1,000వస్తున్నాయి



నేను గతంలో తోపుడు బండి మీద స్టీల్ సమాన్లు అమ్మేవాడిని. నన్ను గుర్తించి దళితబంధు పథకం ఇచ్చారు. దీంతో స్టీల్ ట్రేడర్స్ షాప్ పెట్టుకున్నాను. దీంతో నేను రోజుకు రూ.1,000 సంపాదిస్తున్నాను. ఇప్పుడు నాకున్న ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి.

–తోట అంబరీష, మానుకోట

పరిస్థితి మారిపోయింది..



నేను ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడిని. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. దళితబంధు కింద రూ.9.90లక్షలు వచ్చాయి. మానుకోట జిల్లా కేంద్రంలోని మూడుకొట్ల సెంటర్‌లో ఎలక్ట్రికల్స్– శానిటరీ షాపు పెట్టుకున్నాను. ఇప్పుడు రోజుకు రూ.మూడు వేల నుంచి రూ. ఐదు వేల వరకు వ్యాపారం అవుతోంది.

– మల్లేష్, వీసంపల్లి, చిన్నగూడురు

వెలుగులు నిండాయి..



దళితబంధు పథకంతో చాలా మంది దళితుల జీవితాల్లో వెలుగులు నిండాయి. దళితుల భావితరాలకు బంగారు బాట వేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ దళితబంధు పథకం అమలు చేస్తున్నారు. దీంతో దళితుల్లో ఆర్థికంగా మార్పులు వచ్చాయి. మహనీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ జగ్జీవన్‌రామ్ కన్న కలలను సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ దళితులను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారు.


–బానోత్ శంకర్‌నాయక్, మానుకోట ఎమ్మెల్యే

నర్సంపేట రోడ్డులో రెడ్యానాయక్ కాలనీ సమీపంలో గుట్టలపై పేదలు వేసిన గుడిసెలు



గుట్టలపై గుడిసెలు..

మహబూబాబాద్ పట్టణ కేంద్రం, శివారు ప్రాంతాల్లోని గుట్టలపై నూతనంగా వందలాది గుడిసెలు వెలిశాయి. నర్సంపేట రోడ్డులోని రెడ్యానాయక్ కాలనీ సమీపంలోని గుట్టలపై పేదలు వేసిన గుడిసెలు జాతరను తలపిస్తున్నాయి. అదేవిధంగా హస్తినాపురం కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుట్టలపై వందలాది గుడిసెలు వెలిశాయి.



హస్తినాపురం కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుట్టలపై వెలసిన గుడిసెలు

–సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

జిల్లా సంక్షేమాధికారిగా వరలక్ష్మి?

మహబూబాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీడబ్ల్యూఓగా పనిచేసి ప్రస్తుతం సెలవుల్లో ఉన్న వరలక్ష్మిని మానుకోట జిల్లా సంక్షేమాధికారిగా బదిలీ చేస్తూ ఆశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. ప్రస్తుతం జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా పనిచేస్తున్నారు. కాగా వరలక్ష్మి ఈనెల 4న బాధ్యతలు స్వీకరించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని డీపీఎంఓ డాక్టర్ వనాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొమ్మనపెల్లితండా ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయిపెల్లి యాకయ్య, పీఎంఓ కృష్ణ, ఏఎన్‌ఎం శారద, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎంఓ వనాకర్‌రెడ్డి

యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దు

తొర్రూరు: యూరియా, ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఎరువులు, యూరియా స్టాక్, ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఏఓ మాట్లాడుతూ.. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామన్నారు. ఏదైనా సరుకు కొనాలంటూ లింకు పెడితే రైతులు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. తనిఖీల్లో ఏఓ కుమార్‌యాదవ్, ఏఈఓ రవితేజ ఉన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

క్లుప్తంగా

ముగ్గురిపై కేసు నమోదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శుక్రవారం పట్టణంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టగా నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతుండడమే గాకుండా సరైన కాగితాలు లేవన్నారు. పత్తి నిరంజన్, వడ్డెపల్లి రామకృష్ణ, కట్కూరి సృజన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సును వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో బస్సు వెనుక భాగం దెబ్బతిన్న సంఘటన శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో జఫర్‌గఢ్ నుంచి వర్ధన్నపేట బస్టాండ్‌కు వెళ్తున్న క్రమంలో వరంగల్ వైపు వెళ్తున్న బొగ్గు లోడు లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం బాగా దెబ్బతింది. అంతకు ముందే ప్రయాణికులు వర్ధన్నపేట పాత బస్టాండ్ వద్ద దిగిపోవడంతో ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యం



వర్ధన్నపేట: కిరాణ షాపుకు వెళ్లి వస్తానని తన కూతురు తిరిగి రాలేదని వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మండలంలోని బండౌత పురం గ్రామానికి చెందిన మంచాల యాకయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా పెద్ద కూతురి వివాహం చేశారు. చిన్న కూతురు అఖిల ఈ నెల 14న సాయంత్రం కిరాణసామానుకని వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

రూ.1.72 లక్షలు మాయం

కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ రావడంతో లిఫ్ట్ చేసి వారు అడిగిన వివరాల తెలపడంతో రూ.1,72,291లను పోగొట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. బాధితుడికి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకోవాలని సూచించగా నిజమేనని నమ్మి వారు అడిగిన వివరాలను చెప్పడంతో బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం అయ్యింది. బాధితుడు మోసపోయినట్లుగా గుర్తించి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.




జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు



హాజరైన కలెక్టర్లు, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్

యోగాతో మానసికోల్లాసం



దినచర్యలో భాగం చేసుకోవాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా ప్రారంభమైన యోగా మహోత్సవ్



యోగా చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: ప్రతిఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని, ఓరుగల్లు ప్రజలు యోగా శిక్షణలో పాల్గొనాలని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకు ముందు యోగా గురువు, పద్మవిభూషన్ దాజీ (కమలేష్ దేసాయి భాయ్ పటేల్)ను స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కన్హా శాంతివనం తరహాలోనే ఓరుగల్లు సమీపంలో శాంతివనాన్ని నిర్మించడానికి తగిన ఏర్పాట్లను చేస్తామన్నారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన భారతదేశంలో యోగా పట్ల ఆసక్తిని కలిగించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. యోగా గురువు దాజీ మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా యోగాను ఆచరిస్తున్నారని, ధ్యానంతో మనసు ప్రశాంతత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, ప్రఖ్యాత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, సీపీ ఏవీ రంగనాథ్, కేయూ వీసీ ఆచార్య రమేష్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య, విద్యార్థులు, అధికారులు పాల్గొని శిక్షణ నిపుణుల ద్వారా యోగా, ధ్యానం ఆచరించారు.

మంత్రి ఫోన్ పోయిందంటూ హైరానా

చిల్పూరు: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చెందిన ఫోన్ పోయిందని తెలపడంతో అధికారులు, పోలీసులు, నాయకులు కొద్ది సేపు హైరానా పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం చిల్పూరు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద చోటు చేసుకుంది. వివరిలాల ఉన్నాయి..వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణానికి హాజరైన మంత్రితో పాటు ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డిలు హాజరయ్యారు. స్వామివారి తలంబ్రాలు సమర్పించిన అనంతరం వెలుతున్న క్రమంలో తన మొబైల్ ఫోన్ కనిపించడం లేదని తెలపడంతో అందరు హైరానా పడ్డారు. మైకులో సైతం ప్రచారం చేశారు. కాసేపటికి చైర్మన్ శ్రీధర్‌రావు, అర్చకులు స్వామివారి మహిమతో ఫోన్ దొరికిందంటూ మైకులో తెలిపారు. ఇంతకీ ఆ ఫోన్ మంత్రి గారి కారులోనే ఉందనడంతో సంతోషపడ్డారు.



యోగా చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, వీసీ, తదితరులు

భార్యపై భర్త దాడి..

- ఐరన్ పైపుతో కొట్టడంతో తీవ్ర గాయాలు



భర్త దాడిలో గాయపడిన సరిత

ఖిలా వరంగల్: భర్త వేధింపులు తాళలేక ఇద్దరి పిల్లలతో కలిసి పుట్టింటిలో తలదాచుకుంటున్న ఓ మహిళను అకస్మాత్తుగా రోడ్డుపై భర్త ఐరన్ పైపుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈ ఘటన శుక్రవారం శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చోటు చేసుకుంది. బాధితురాలి తల్లి గద్దల శారద తెలిపిన వివరాల ప్రకారం.. శంభునిపేట నాగేంద్రనగర్ కాలనీకి చెందిన గద్దల శారద కుమార్తె సరిత (27)ను పదేళ్ల క్రితం నర్సంపేట మండలం నాగుర్లపెల్లి గ్రామానికి చెందిన వేల్పుల రఘు (30)కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. రఘు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సరిత, ఇద్దరు పిల్లలు పోషిస్తున్నాడు. మూడేళ్ల క్రితం రఘు మద్యానికి బానిసై భార్య సరితను కొట్టడంతో వరంగల్ నాగేంద్రనగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యాభర్తల పంచాయితీ పలుమార్లు గ్రామ పెద్దల ఎదుట జరిగింది. పద్ధతి మార్చుకుంటానని చెప్పి భార్య, పిల్లలను తీసుకెళ్లి మళ్లీ చిత్ర హింసలకు గురిచేయడంతో సరిత పిల్లలతో కలిసి పుట్టింటిలో ఉంటుంది. ఈ విషయమై రెండేళ్ల క్రితం వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో సరిత కేసు పెట్టింది. ఇద్దరి పిల్లలను శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిస్తూ తాను వరంగల్ చౌరస్తాలోని ఓ షాపులో పనిచేస్తూ జీవనం గడుపుతుంది. శుక్రవారం ఉదయం పిల్లలను పాఠశాలకు పంపించి షాపుకు బయలుదేరుతున్న సమయంలో అకస్మాత్తుగా సరిత భర్త రఘు కాపురానికి రాకుంటే చంపేస్తానంటూ ఐరన్ పైపుతో దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. భారీగా స్థానికులు రావడంతో రఘు అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న సామాజిక కార్యకర్త ఎండీ ఫసీ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని ఎంజీఎంకు తరలించారు. సరిత తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించినా.. సకాలంలో స్పందించలేదని, స్థానికులు అడ్డుకోవడంతోనే రఘు అక్కడి నుంచి పారిపోయాడని, లేదంటే ఎక్కువ గాయాలయ్యేవని సామాజిక కార్యకర్త ఫసీ తెలిపారు.

తన ప్రేమను నిరాకరించిందని..

- రైలు కిందపడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

కాజీపేట రూరల్: తాను ప్రేమించిన అమ్మాయి దక్కదని జీవితంపై విరక్తి చెంది ఓ బీటెక్ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాజీపేట, కోమటిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె. దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన పాలమేని నరేష్ (20) మహేశ్వరంలోని ఓ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మృతుడి తండ్రి సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను ప్రేమించిన అమ్మాయి తన ప్రేమను నిరాకరించిందని జీవితంపై విరక్తి చెంది చినిపోవాలని నిర్ణయించుకొని కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో డౌన్ మార్గంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహానికి ఎంజీఎంలో పోర్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడు...

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో శుక్రవారం ఇప్పకాయల శివ (25) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని మానసిక కుంగుపాటుతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లి భాగ్యరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షుకుర్ తెలిపారు.


కుటుంబ కలహాలతో వైద్యుడు..



సారంగపాణి (ఫైల్)

నెక్కొండ: కుటుంబ కలహాలతో ప్రైవేట్ వైద్యుడు గద్దం సారంగపాణి (58) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసకున్న సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండలోని హైస్కూల్ సెంటర్‌లో మహేశ్వర ఆస్పత్రి వైద్యుడు కొంత కాలంగా భార్య విజయతో గొడవ కారణంగా భార్యభర్తలు విడాకులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వాలని భార్య డిమాండ్ చేయడం, పరువు పోతుందనే మనోవేదనతో నాలుగు రోజుల క్రితం సారంగపాణి ఉరి వేసుకోగా స్థానికులు గమనించి కాపాడారు. మళ్లీ ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో విబేధాలు ఉండటంతో మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆకతాయిలను పట్టుకున్న షీ టీం



విద్యార్థులతో మాట్లాడుతున్న షీటీం పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రతిరోజు సాయంత్రం సమయంలో ఆకతాయిలు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని శుక్రవారం 'సాక్షి'లో 'విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన షీటీం పోలీసులు శుక్రవారం సాయంత్రం షీటీం ఏసీపీ డేవిడ్ రాజ్, ఇన్‌స్పెక్టర్ సంజీవరావుల నేతృత్వంలో పాఠశాలకు వచ్చే దారిలో ఉన్న 12 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మహిళల రక్షణకు షీటీం పనిచేస్తాయన్నారు. ఎలాంటి సమయాల్లోనైన మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్‌లో గాని, సోషల్ మీడియాలోనైన వేధింపులకు గురిచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు, మహిళలు 87126 85257, 87126 85142, 87126 85270లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బాలికలను వేధిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. అనంతరం అదుపులోకి తీసుకున్న ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు విద్యాసాగర్, కుమారస్వామి, ఎస్‌ఐ స్వాతి, ఏఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వంశీకృష్ణ, రాంరెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.6లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జనగామ డీసీపీ పి.సీతారాం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను జనగామ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసిన డీసీపీ సీతారాం అరెస్ట్ వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా రాఘవాపూర్‌కు చెందిన మునిగండ్ల విజయ్ తాగుడుకు బానిసగా మారి జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడి జైలు జీవితం కూడా గడిపాడు. అనేక సార్లు జైలుకు వెళ్లి శిక్షలు అనుభవించినా, విజయ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పాటు మరో ఇద్దరి దొంగలతో చేతులు కలిపి గత నెల ఖమ్మం జిల్లా పాల్వంచ నవభారత్ వీధిలో చోరీకి పాల్పడ్డారు. అక్కడి నుంచి గత నెల 20న జనగామకు వచ్చారు. పట్టణంలోని వాసవీ కాలనీ నివాస ముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివగారి కిరణ్, రజని ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం పక్కా సమాచారంతో ప్రెస్టన్ మైదానం నుంచి పారిపోయే క్రమంలో పట్టుకున్నారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి



సందీప్ (ఫైల్)

కాశిబుగ్గ: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం, వెంకటాపూర్‌కు చెందిన వరిపెల్లి సందీప్ అలియాస్ సన్నీ (26) తన తమ్ముడు రాజుతో కలిసి వరంగల్ నగరంలో నివాసం ఉంటూ హంటర్‌రోడ్డులోని టిఫిన్ బండిపై మాస్టర్ కుక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అండర్‌బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

మోపెడ్ అదుపు తప్పి..



భిక్షపతి మృతదేహం

బచ్చన్నపేట: మోపెడ్ వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మన్‌సాన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంజాల భిక్షపతి (60) గ్రామంలో పోస్టుమెన్ ఇస్తున్న పెన్షన్‌ను తీసుకోవడానికి మోపెడ్ వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించిగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కిల్లర్‌పై పీడీ యాక్ట్



నిందితుడికి పీడీ యాక్ట్ పత్రాలు అందజేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడిన నిందితుడిపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడిన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన గడ్డం రత్నాకర్‌పై సీపీ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి నిందితుడికి శుక్రవారం కరీంనగర్ కారాగారంలో అందజేసిన అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గత సంవత్సరం కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద సుపారీ తీసుకొని ఆమె భర్తను దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనలో సుపారీ కిల్లర్‌తో పాటు సుపారీ ఇచ్చిన మహిళతో సహా మరో ముగ్గురిని అరెస్టు చేశారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గతంలో రాచకొండ, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయబడుతాయని సీపీ హెచ్చరించారు.

ప్రీతి ఘటనలో విచారణ వేగవంతం

- రెండో రోజు సైఫ్‌ను విచారించిన పోలీసులు

ఎంజీఎం: ప్రీతి ఘటనలో పోలీసుల విచారణ వేగవంతంగా కొనసాగుతుంది. రెండు రోజులుగా సైఫ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. శుక్రవారం విచారణలో పోలీసులు మరింత పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ప్రీతికి సంబంధించిన సెల్‌ఫోన్ సమాచారం వివరాలతో పోలీసులు కేసు మిగతా ఆధారాల కోసం ముందుకు సాగుతున్నట్లు తెలిసింది. ప్రీతి సెల్‌ఫోన్‌లో 27 స్క్రీన్ షాట్స్, మెస్సేజ్‌లు కీలకంగా మారినట్లు వెల్లడవుతోంది. మెడికో, ఎల్‌డీడీ నాకౌట్ వాట్సాప్ గ్రూపుల నుంచి, మరో ముగ్గురు వైద్యుల నుంచి మెసేజీలు సేకరించారు. సేకరించిన వాటిపై పోలీసులు సైఫ్ నుంచి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఘటన స్థలంలో ఉన్న హెడ్‌నర్సు, స్టాఫ్ నర్సు నుంచి కూడా మరిన్ని వివరాలు రాబట్టినట్లు చర్చించికుంటున్నారు. ప్రతీ వాడిన హ్యాండ్ బ్యాగ్‌లో ఏయే వస్తువులు ఉన్నాయనే వివరాలు పోలీసులు తెలుసుకున్నారు. ఘటన రోజు విధులు నిర్వర్తించిన సెక్యూరిటీ గార్డుల నుంచి కీలకమైన అంశాలను సేకరించినట్లు ఎంజీఎంలో సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. సైఫ్ నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలను పోల్చుతూ విచారణ కొనసాగిస్తున్నారు. కేసు పురోగతిపై త్వరలోనే కొలిక్కి తేస్తారనే వాదన వినిపిస్తోంది.

దోషులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాంచందర్‌నాయక్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

కొడకండ్ల: బంగారు భవిష్యత్ కలిగిన బంజార బిడ్డ ధరావత్ ప్రీతి చదువు దుర్మార్గుడి ర్యాగింగ్‌కు బలవడం విచారకరమని, పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని గిర్నితండాలో ప్రీతి తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకొని ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ సీటు ప్రభుత్వ కళాశాలలో సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రీతి మృతి కుటుంబానికి కాదని, సమాజానికి తీరని లోటన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో దర్యాప్తు చేయిస్తుందని, సీపీ రంగనాథ్ నేతృత్వంలో నిస్పక్షపాతంగా దర్యాప్తు చేసి దోషులకు శిక్ష పడేలా చేస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవాసంఘ్ నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌నాయక్, హేమానాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైఫ్‌ను ఉరితీయాలి

హన్మకొండ: డాక్టర్ ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రీతి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ క్యాండిల్స్ వెలిగించారు. ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ వైద్య విద్యార్థిని ప్రీతి మరణం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల కోమల, గుజ్జుల వసంత, జిల్లా కార్యదర్శి తోపుచర్ల అర్చన, కేతిరెడ్డి విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల గంజాయిని శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరొకరు పరారైనట్లు వారు తెలిపారు. స్థానిక కొత్తకాలనీ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఇదే సమయంలో వరంగల్‌కు చెందిన వి. రాజు, జగ్గన్నపేటకు చెందిన ఎల్. రవీందర్ ధారకొండ నుంచి గంజాయిని ఆటోలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. ధారకొండకు చెందిన కొర్రా ముకుంద అనే వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.